ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com

# కాకతీయ

శుక్రవారం, 28 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 15 | పేజీలు: 8 వెల: 5

రాజకీయాల్లోకి రావాలని నేను ముందే నిర్ణయించుకున్నది కాదు.. పరిస్థితులే నన్ను ఆ దారిలోకి తీసుకొచ్చినయి. మా నాన్న రాజకీయాల్లో ఉండేవాడు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో ఎదురైన కక్షసాధింపులు నాలో కసి పెంచినయి. అయితే చిన్నప్పటి నుంచే నాకు రాజకీయాలంటే ఆసక్తి ఉండేది. పదో తరగతిలోనే స్కూల్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన. 1982లో ఎన్టీఆర్ పార్టీ పెడుతున్నాడని తెలిసి వరంగల్ నుంచి నాలుగు జీపుల్లో కార్యకర్తలను తీసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి కలిసిన. అక్కడ ఆయన పలకరించి తన కారులో నన్ను ఆయనతోపాటు ఓ మీటింగ్‌కు తీసుకెళ్లారు. అలా మొదలైన పరిచయం టీడీపీ ఏర్పాటు, జెండా రూపకల్పన వరకు వెళ్లింది. ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ప్రజల మధ్య పనిచేసిన. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా గెలిచిన. నా రాజకీయ జీవితంలో ఎన్నో మలుపులు ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికీ తలుచుకుంటే ఆసక్తిగానే అనిపిస్తయి.. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. గురువారం హన్మకొండలోని ఆయన స్వగృహంలో డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈసందర్భంగా అనేక ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!

కేసీఆర్ మామే

## మా పెళ్లి చేసిండు..!

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై నాకు ఆసక్తి

టీడీపీలో ఆది నుంచి అన్నింటా కీలకమయ్యాను



ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా విజయం వెనుక ఉన్నది ప్రజల అభిమానమే

ఎంపీగా మాత్రం ఊహించని విజయం సొంతం

లక్ష్మీపార్వతి 'వడ్డాణం' అడిగారు.. అందుకే మంత్రి పదవి వద్దన్నా

పాలకుర్తిలో మాస్క్ పెట్టుకుని సర్వే చేసుకున్నాకే అక్కడికి వెళ్లా

డీలిమిటేషన్ తర్వాత ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా..

వారసులను మాత్రం రాజకీయాల్లోకి దింపను

డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాజీమంత్రి ఎర్రబెల్లి ఆసక్తికర అంశాల వెల్లడి

7



## ఇదేనా ప్రజాస్వామ్యం?

# విద్యార్థులపై ఉక్కుపాదమా..

### జీవో 97 రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు నొక్కొద్దు

ప్రశ్నిస్తే అరెస్టులు.. నిరసిస్తే నిర్బంధాలు

ఉద్యోగులు, విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం ఆగదు

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు

**కాకతీయ, హన్మకొండ :** పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ నేతలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాన్ని అణచివేయడం, విద్యార్థుల ఆందోళనలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**'పాలిటెక్నిక్‌ను ప్రైవేటుపరం చేసేందుకేనా?'**

సుబేదారి పోలీస్‌స్టేషన్

........(తరువాయి 2లో)

## మహిళ కన్నీటి చుక్క.. సునామీ అవుతుంది

- కొండా సురేఖ వ్యవహారంపై బహిరంగంగా మాట్లాడను
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- జడ్చర్ల అభివృద్ధి పనుల కోసం అవసరమైతే దీక్ష
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు

2





బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనానికి

## హరీష్ యత్నాలు

- విలీన ప్రక్రియకు హరీశ్‌రావే నేతృత్వం
- మెదక్‌లో ఎమ్మెల్యేలతో రహస్య భేటీ
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- 'భవిష్యత్తు మనదే' అంటూ వ్యాఖ్యలు
- ఆంధ్ర కంపెనీలు, నేతల కోసం మూడు పార్టీలు పనిచేస్తున్నాయని విమర్శ
- కేటీఆర్ రాఖీ పండుగకు అందుబాటులో లేకపోవడంపై కవిత అసంతృప్తి

**హైదరాబాద్:** బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రక్రియకు మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వం వహిస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇటీవల మెదక్‌లో ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు రహస్యంగా సమావేశమయ్యారని, భవిష్యత్తు తమదేనంటూ ఆయన చెప్పినట్లు ఆ భేటీలో పాల్గొన్న ఓ ఎమ్మెల్యే తనకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ మాదిరిగానే కేసీఆర్ కూడా పెద్ద నాయకుడని.. ఆయన తర్వాత తానే నాయకత్వం వహిస్తానని, ఆ తర్వాత జరగాల్సింది బీజేపీ చూసుకుంటుందని హరీశ్‌రావు చెప్పినట్లు

........(తరువాయి 2లో)

### సీఎంకు పక్క రాష్ట్రంపైనే ప్రేమ

- తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రా నేతలకే ప్రాధాన్యం!
- రేవంత్‌ది తెలంగాణ నాయకత్వం కాదు
- ఆంధ్రా రేవంత్‌రెడ్డిగా వ్యవహరిస్తున్నారు
- బ్రాహ్మణ పరిషత్ పదవుల్లో స్థానికులకు చోటివ్వాలి
- యాదాద్రి బోర్డులోనూ తెలంగాణవారికే ప్రాధాన్యం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపణలు

2

బంగారం వెలికితీసి

## దేశ సంపద పెంచుదాం

- అన్వేషణ పనులను వేగవంతం చేయాలి
- స్థానికుల సహకారంతో ప్రాజెక్టును విజయవంతం చేయాలి
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- లింగదహళ్లి గ్రామంలో బంగారం అన్వేషణ కార్యక్రమం ప్రారంభం
- సైట్ కార్యాలయం, హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆదేశం




**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా లింగదహళ్లి గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టనున్న బంగారం, రాగి ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని గురువారం ఆయన అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అన్వేషణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 136 ఏళ్ల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ బ్లాక్ అన్వేషణ హక్కులను దక్కించుకుందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అన్వేషణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బంగారం, రాగి నిక్షేపాలు విరివిగా లభిస్తే స్థానికంగా నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి

........(తరువాయి 2లో)



## అక్రమాలకు బల్దియా ప్రసన్నం!

- సర్వే నంబర్లు మార్చి ఇంటి నంబర్లు కేటాయింపు
- డిప్యూటీ కమిషనర్ సంతకంతో వివాదాస్పద ఉత్తర్వులు
- గ్రీవెన్స్ ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం
- బాధితులకు 'కోర్టుకు వెళ్లాంటూ అధికారుల ఉచిత సూచన
- డీసీ ప్రసన్నరాణి తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఒకే స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు, ఇంటి నంబర్ల విషయంలో భిన్నమైన రికార్డులు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని పైడిపల్లి శివారు కత్తెరశాల లక్ష్మీకాంత్ కాలనీలో 600 గజాల స్థలానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులకు గతంలో మంజూరైన ఇంటి నంబర్లను తొలగించి.. మరో వ్యక్తి పేరుతో ఇంటి నంబర్ కొనసాగించేందుకు డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి పేరుతో నోటీసులు జారీ కావడంపై బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయగా.. సమస్యను

........(తరువాయి 2లో)

నేపాల్ వరదల్లో హైదరాబాద్

## యువతి గల్లంతు

- మానస సరోవర్ యాత్రకు వెళ్లిన సుహాసిని రెడ్డి ఆచూకీ గల్లంతు
- మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఫోన్‌కు స్పందన కరవు
- నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణవాసులు 23 మంది: మంత్రి పొంగులేటి
- కుటుంబసభ్యుల ఆందోళన.. సురక్షితంగా తీసుకురావాలని వేడుకోలు

3



## కొత్త కొలువుల నోటిఫికేషన్లకు రంగం సిద్ధం

- ఈ నెలాఖరు లేదా సెప్టెంబరు నుంచి మరో 15 ప్రకటనలు
- అత్యధికంగా అటవీ బీట్ అధికారి పోస్టుల భర్తీ
- ఆర్థిక శాఖ అనుమతించిన 3,800 పోస్టుల్లో 1,398 బీట్ అధికారి ఉద్యోగాలు
- ఇప్పటికే 9 నోటిఫికేషన్లు.. పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు

3

TELANGANA PUBLIC SERVICE COMMISSION
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

# అక్రమాలకు బల్దియా ప్రసన్నం!

(మొదటిపేజీ తరువాయి)




కోర్టులో తేల్చుకోవాలని డీసీ సూచించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పైడిపల్లి శివారు కత్తెరశాల లక్ష్మీకాంత్ కాలనీలోని సర్వే నంబర్ 624లో 600 గజాల స్థలాన్ని నీలారపు మంజుల, పెంచర్ల రాజు పటేల్, షేర్ల కుమారస్వామి కొనుగోలు చేసినట్లు వారు చెబుతున్నారు. సంబంధిత పత్రాల ఆధారంగా మ్యూటేషన్లు జరిగాయని, అప్పటి నుంచి ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ స్థలాన్ని వినియోగిస్తున్నామని పేర్కొంటున్నారు. మంజులకు 4751395/1/4, రాజుకు 4751395/1/3, కుమారస్వామికి 4751395/1/5 ఇంటి నంబర్లు ఉన్నాయని చెబుతున్నారు. అయితే కొంతకాలం తర్వాత రామసహాయం వెంకట్‌రెడ్డి అదే ప్రాంతంలోని ఇళ్లను చూపించి తన పేరుతో కొత్త ఇంటి నంబర్ పొందినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆయనకు సంబంధించిన సర్వే నంబర్ 527/బిగా రికార్డుల్లో నమోదైనట్లు చెబుతున్నారు. దీనిపై అప్పటి డిప్యూటీ కమిషనర్ ఇసంపల్లి జోనాకు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం వెంకట్‌రెడ్డి ఇంటి నంబర్ రద్దు చేసినట్లు బాధితులు తెలిపారు.

**మళ్లీ తెరపైకి పాత వివాదం**

దాదాపు ఐదేళ్ల తర్వాత రెండు నెలల క్రితం కాశిబుగ్గ సర్కిల్ నుంచి బాధితులకు నోటీసులు రావడంతో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. వెంకట్‌రెడ్డి సమర్పించిన పత్రాలను పరిశీలించగా 527/బి సర్వే నంబర్‌లోని 600 గజాల స్థలానికి ఆయనే యజమాని, స్వాధీనదారుడిగా గుర్తించినట్లు నోటీసులో పేర్కొన్నారు. 2005లో స్థలాన్ని కొనుగోలు చేసినట్లు, 2015-17 మధ్య ఎల్ఆర్ఎస్ పొందినట్లు, నిర్మాణానికి అనుమతి తీసుకున్నట్లు అందులో ప్రస్తావించారు. దీంతో బాధితుల ఇంటి నంబర్లు తొలగించి వెంకట్‌రెడ్డి ఇంటి నంబర్‌ను కొనసాగిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నట్లు వారు చెబుతున్నారు.

**సర్వే రిపోర్టులో ఏముంది?**

జూలై 13న తమ ఇంటి ప్రహరీ గోడను వెంకట్‌రెడ్డి కూల్చివేశారని బాధితులు ఆరోపించారు. దీనిపై హన్మకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా జూలై 18న కేసు నమోదైనట్లు తెలిపారు. అనంతరం ఇరువర్గాల వాదనల నేపథ్యంలో ఏసీ సర్వే నిర్వహించగా.. ఈ నెల 5న జరిగిన సర్వేకు సంబంధించి 14న ఇచ్చిన నివేదికలో స్థలం సర్వే నంబర్ 624/1/2కు సంబంధించినదిగా గుర్తించినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ రిపోర్టుతోపాటు తమ హక్కు పత్రాలను కమిషనర్ గ్రీవెన్స్ సెల్‌లో సమర్పించినట్లు తెలిపారు. అక్కడే ఉన్న కాశిబుగ్గ సర్కిల్ డీసీ ప్రసన్నరాణికి కూడా వివరాలు అందించామని, అయితే 'ఇది మా పరిధిలో లేదు.. కోర్టుకు వెళ్లండి' అని సూచించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

**రికార్డులపై విచారణ జరగాలి**

తమకు గతంలో మంజూరైన ఇంటి నంబర్లను తొలగించి.. మరో సర్వే నంబర్‌కు చెందిన వ్యక్తి పేరుతో ఇంటి నంబర్ ఎలా కొనసాగిస్తారన్నదే బాధితుల ప్రధాన ప్రశ్న. ఒకవైపు సర్వే నివేదిక 624/1/2ను సూచిస్తుండగా.. మరోవైపు 527/బి ఆధారంగా వెంకట్‌రెడ్డి ఇంటి నంబర్‌ను కొనసాగించడంపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాత మ్యూటేషన్ రికార్డులు, ఇంటి నంబర్ల కేటాయింపు ఫైళ్లు, సర్వే నివేదికలు, నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కోరుతున్నారు. తమ ఇంటి నంబర్లను పునరుద్ధరించి, వివాదాస్పద నిర్ణయాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంజుల, కుమారస్వామి, రాజు డిమాండ్ చేస్తున్నారు.

# బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనానికి హరీష్ యత్నాలు

(మొదటిపేజీ తరువాయి)



తనకు తెలిసిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగానే ఈ పరిణామాలు జరుగుతున్నాయని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

**'పసుపు పాలు' వస్తే రాజ్‌పుష్పకు..**

ఆర్ఎస్ఎస్ నేత ఒకరి కనుసన్నల్లోనే హరీశ్‌రావు పనిచేస్తున్నారని కవిత ఆరోపించారు. ఆయన వచ్చే ముందు హరీశ్‌రావు ఇంటికి పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తాయని వ్యాఖ్యానించారు. ఢిల్లీకి చెందిన ఆ వ్యక్తి తెలంగాణకు వస్తున్నాడనడానికి ఇదే సంకేతమని పేర్కొన్నారు. ఆ వ్యక్తి వచ్చిన తర్వాత హరీశ్‌రావు తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుని రాజ్‌పుష్ప ఓపెన్ స్కైవిల్లాకు వెళ్లారని ఆరోపించారు. ఆయన సూచనల మేరకే హరీశ్‌రావు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే..**

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కలిసి అవినీతిని వ్యవస్థీకృతం చేశాయని కవిత ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉన్నా ఆంధ్ర ప్రాంత కంపెనీలు, నేతల మాటే చెల్లుబాటు అవుతోందని విమర్శించారు. మూడు పార్టీలు కలిసి ఆంధ్ర వ్యాపారులను పెంచి పోషిస్తున్నాయని మండిపడ్డారు. కేసుల పేరుతో గతంలో హడావుడి చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. హరీశ్‌రావు నిందితుడిగా ఉన్న ఏ కేసూ ముందుకు కదలడం లేదని ఆరోపించారు. తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించాలంటే నిజమైన తెలంగాణ నేతలు, ప్రజల కోసం నిలబడే వారిని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 31న నిజామాబాద్‌లో నిర్వహించే సభకు తరలిరావాలని కోరారు.

**'కేటీఆర్.. నేను హర్ట్ అయ్యా'**

రాఖీ పౌర్ణమి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందుబాటులో లేకపోవడంపైనా కవిత అసంతృప్తి వ్యక్తం చేశారు. గతేడాది పండుగకు నగరంలో లేకుండా రాఖీ కట్టించుకోలేదని.. ఈసారి ఏకంగా దేశంలోనే లేకుండా వెళ్లిపోయారని వ్యాఖ్యానించారు. పవిత్రమైన రాఖీ పండుగ రోజు కేటీఆర్ అందుబాటులో లేకపోవడం తనను తీవ్రంగా బాధించిందని, తాను హర్ట్ అయ్యానని అన్నారు. ఈ అంశాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని సూచించారు.

# సీఎంకు పక్క రాష్ట్రంపైనే ప్రేమ

- తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రా నేతలకే ప్రాధాన్యం!
- రేవంత్‌ది తెలంగాణ నాయకత్వం కాదు
- ఆంధ్రా రేవంత్‌రెడ్డిగా వ్యవహరిస్తున్నారు
- బ్రాహ్మణ పరిషత్ పదవుల్లో స్థానికులకు చోటివ్వాలి
- యాదాద్రి బోర్డులోనూ తెలంగాణవారికే ప్రాధాన్యం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపణలు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వేడిని పెంచాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఆమె.. తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రా ప్రాంతానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ నాయకుడిగా కాకుండా 'ఆంధ్రా రేవంత్‌రెడ్డి'గా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, అధికార యంత్రాంగంలో స్థానికులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించారు. బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ పదవిని బసవరాజు శ్రీనివాసరావుకు కట్టబెట్టడాన్ని కవిత ప్రశ్నించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి ఇవ్వడం ఏమిటని నిలదీశారు. తెలంగాణలో బ్రాహ్మణ మేధావులు లేరా అని ప్రశ్నించారు. తెలంగాణ పేద బ్రాహ్మణులకు అండగా నిలవాల్సిన బ్రాహ్మణ పరిషత్.. ఆంధ్రా రౌడీలకు అడ్డాగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బసవరాజు శ్రీనివాసరావు తెలంగాణవాదులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, దళిత మహిళలు, తెలంగాణ ప్రజలను దూషించారని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి కీలక పదవిలో కొనసాగడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల్లో తెలంగాణకు చెందిన అర్హులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నియామకాల్లో ప్రాంతీయ సమతుల్యత పాటించాలని కోరారు. రెడ్‌కో ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు నీటిపారుదల, విద్యుత్ శాఖల్లోనూ ఆంధ్రా ఆధిపత్యం ఉందని ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో తెలంగాణ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**యాదాద్రి బోర్డులోనూ స్థానికులకే చోటు**

యాదాద్రి ఆలయ బోర్డులో ఆంధ్రా హీరో భార్యకు సభ్యత్వం కల్పించడంపైనా కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భక్తుల డబ్బులతో నిర్మించిన ఆలయంలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. తిరుపతి బోర్డులో తెలంగాణవారికి అవకాశం కల్పిస్తే అక్కడి వ్యవస్థలో మనవారి భాగస్వామ్యం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ యువతకు ఉపాధి, పరిశ్రమలు, సంస్థల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బయోకాన్‌లో తెలుగు మాట్లాడినందుకు 200 మందిని తొలగించారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి స్పందించలేదని విమర్శించారు. నారాయణ కళాశాలలో సంవత్సరం మధ్యలో పలువురిని తొలగించారన్న అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అవకాశాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఆంధ్రా అనుకూల విధానాలు కొనసాగితే తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని హెచ్చరించారు. స్థానిక హక్కుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాజకీయంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**హరీశ్‌రావుపై క్విడ్ ప్రో కో కేసు పెట్టాలి**

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలని కవిత డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మంత్రి పదవిని ఉపయోగించుకుని సొంత డెయిరీకి లాభం చేకూర్చారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ రంగ డెయిరీకి బదులుగా సంస్థలకు సొంత డెయిరీ నుంచి పాలు సరఫరా చేసి ఎనిమిదేళ్లలో భారీ వ్యాపారం చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం క్విడ్ ప్రో కో పరిధిలోకి వస్తుందా లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. చిత్తశుద్ధి ఉంటే దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఐదువందలకు పైగా విద్యార్థులు ఉన్న ప్రతి విద్యాసంస్థకు ప్రభుత్వ లేదా సొసైటీ ఆధ్వర్యంలోని డెయిరీల నుంచి పాలు సరఫరా చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.


# మహిళ కన్నీటి చుక్క.. సునామీ అవుతుంది

- కొండా సురేఖ వ్యవహారంపై బహిరంగంగా మాట్లాడను
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- జడ్చర్ల అభివృద్ధి పనుల కోసం అవసరమైతే దీక్ష
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం కొనసాగుతున్న వేళ.. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మహిళలను తాను ఎంతో గౌరవిస్తానని, వారి గురించి బహిరంగంగా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. మహిళలు తనను తిట్టినా వాటిని ఆశీర్వాదాలుగానే భావిస్తానన్నారు. తన తల్లి మందలించినా ఎదురు మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోతానని పేర్కొన్నారు. మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటే ఆ భావోద్వేగాన్ని తేలిగ్గా తీసుకోరాదన్నారు. మహిళ కన్నీటి చుక్క ఒక్కటి నేలపై పడినా సునామీగా మారుతుందని.. ఆ సునామీలో మనమే కొట్టుకుపోతామని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ వ్యవహారంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే సూచించారని తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉందన్నారు. ఏఐసీసీ, పీసీసీ, ముఖ్యమంత్రి స్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఎవరు తప్పు చేశారనేది దేవుడికే తెలుసని, కమిటీ నివేదికను గౌరవిస్తానన్నారు.

**జడ్చర్ల కోసం వెనక్కి తగ్గను**

తన నియోజకవర్గ సమస్యల విషయంలో మాత్రం వెనక్కి తగ్గేది లేదని అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడితే ఎవరినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని చెప్పారు. అవసరమైతే మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతానని.. నిధులు రాకపోతే దీక్షకు కూడా కూర్చుంటానని తేల్చిచెప్పారు.



# యశోదలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

- గుండె నొప్పితో ఆస్పత్రిలో చేరిక
- హార్ట్‌లో బ్లాక్స్ గుర్తింపు.. స్టెంట్ అమర్చిన వైద్యులు
- సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

**కాకతీయ, హైదరాబాద్:** తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా గుండె నొప్పితో బుధవారం యశోదా ఆస్పత్రిలో చేరారు. వైద్య పరీక్షల్లో హార్ట్‌లో బ్లాక్స్ ఉన్నట్లు గుర్తించిన వైద్యులు స్టెంట్ వేశారు. ప్రస్తుతం గవర్నర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. గవర్నర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# బంగారం వెలికితీసి దేశ సంపద పెంచుదాం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు లభించడంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సైట్ కార్యాలయం.. హెలిప్యాడ్ ఏర్పాటు**

అన్వేషణ పనుల పర్యవేక్షణ కోసం అధికారులు అక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలో సైట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. స్థానికుల సహకారంతో ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచాలని పిలుపునిచ్చారు. కృష్ణానదికి ఇరువైపులా నివసించే తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతిక బంధం విడదీయరానిదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేదని గుర్తుచేశారు. దేవదుర్గలో చేపట్టిన ఖనిజ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతితో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని ఆకాంక్షించారు.

**ఖనిజ నమూనాల పరిశీలన**

లింగదహళ్లికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు, స్థానిక సర్పంచి ఎల్లమ్మ తదితరులు స్వాగతం పలికారు. దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూపాయింట్ నుంచి అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను భట్టి విక్రమార్క పరిశీలించారు. సింగరేణి అధికారులు సేకరించిన వివిధ ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. బంగారం, రాగి అన్వేషణ, వెలికితీత ప్రక్రియలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి, కర్ణాటక అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి మాట్లాడుతూ దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేశానని, ప్రస్తుతం సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ హోదాలో బంగారం, రాగి అన్వేషణ పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పరమానంద స్వామి ఆశీస్సులతో బంగారు నిక్షేపాలు లభించి స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం లింగదహళ్లిలోని చారిత్రక శ్రీ పరమానంద శివాలయాన్ని భట్టి విక్రమార్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# నేపాల్‌కు మరో వరద ముప్పు..

- లెహెండే నది ఉప్పొంగితే పెను ప్రమాదమే!
- లెహెండే నదిపై భారీ కృత్రిమ సరస్సు..
- నీటిమట్టం పెరుగుతుండటంతో చైనా హెచ్చరిక
- రసువాగఢికి 18 కిలోమీటర్ల ఎగువన అడ్డంకి..
- బోటెకోషి దిగువ ప్రాంతాల ప్రజలకు అప్రమత్తత
- ఇప్పటికే 359 మంది మృతి.. సహాయక, గాలింపు చర్యలు ముమ్మరం

**కాఠ్‌మాండూ :** భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు మరో పెను ప్రమాదం పొంచి ఉంది. లెహెండే నది ఎగువ ప్రాంతంలో నది ప్రవాహానికి కొండచరియలు, బురద, మంచు శిలలు అడ్డుగా పేరుకుపోవడంతో భారీ కృత్రిమ సరస్సు ఏర్పడింది. సరస్సులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో అది ఎప్పుడైనా ఉప్పొంగి భారీ వరదకు దారితీసే ప్రమాదం ఉందని నేపాల్ అధికారులు హెచ్చరించారు. చైనా నుంచి అందిన అత్యవసర సమాచారాన్ని నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా అందుకున్నట్లు హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగంలోని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ గురువారం వెల్లడించింది.

**0.11 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో..**

నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రకారం.. రసువాగఢి సరిహద్దు ప్రాంతానికి సుమారు 18 కిలోమీటర్ల ఎగువన లెహెండే నది ప్రవాహం నిలిచిపోయింది. దీంతో సుమారు 0.11 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సరస్సు ఏర్పడినట్లు అధికారులు గుర్తించారు. నీటిమట్టం పెరుగుతున్నందున సరస్సు బద్దలైతే ఒక్కసారిగా భారీగా నీరు దిగువ ప్రాంతాలకు దూసుకెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో బోటెకోషి నది దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ తీరాల్లోని ప్రజలు, ప్రయాణికులు, సహాయక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని స్పష్టం చేశారు.

**359కు చేరిన మృతుల సంఖ్య**

బుధవారం బోటెకోషి నది పరివాహక ప్రాంతంలో, ముఖ్యంగా నేపాల్‌చైనా సరిహద్దుకు సమీపంలోని రసువాగఢి ప్రాంతంలో భారీ ఫ్లాష్ ఫ్లడ్ సంభవించింది. అనంతరం వరద నీరు త్రిశూలి, నారాయణి నదుల ద్వారా దిగువ ప్రాంతాలకు దూసుకెళ్లింది. రసువా, నువాకోట్, ధాదింగ్, గోర్ఖా, చిత్వన్, తనహూన్, నావల్‌పరాసి వెస్ట్ తదితర జిల్లాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు మృతుల సంఖ్య 359కు చేరినట్లు నేపాల్ పోలీసుల సమాచారాన్ని ఉటంకిస్తూ ది కాఠ్‌మాండూ పోస్ట్ తెలిపింది.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

వరద ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ పోలీసులు, ఇతర భద్రతా సంస్థలు సహాయక, గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ప్రమాదకర ప్రాంతాల నుంచి వందలాది కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరదలకు రోడ్లు, వంతెనలు, నివాస ప్రాంతాలు, ఇతర కీలక మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. మట్టి, శిథిలాలు పేరుకుపోవడంతో అనేక మార్గాలు మూసుకుపోయాయి. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఇప్పటికే భారీ ప్రాణనష్టంతో విషాదంలో ఉన్న నేపాల్‌కు లెహెండే నదిపై ఏర్పడిన కృత్రిమ సరస్సు కొత్త ఆందోళనగా మారింది.

# విద్యార్థులపై ఉక్కుపాదమా.. ఇదేనా ప్రజాస్వామ్యం?

(మొదటిపేజీ తరువాయి)

వద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులపై ప్రభుత్వం అత్యంత కర్కశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల గొంతులు నొక్కుతూ, భౌతిక దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్‌రెడ్డి ఉండటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. 'పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య విశ్వవిద్యాలయంలో కలపాలని నీకు ఎవరు చెప్పారు రేవంత్‌రెడ్డి?' అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేయడం అంటే ప్రైవేటీకరణ చేయడమేనని ఆరోపించారు.

**విద్యార్థుల వద్దకు వెళ్లనీయకుండా అరెస్టులు**

జీవో 97 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపడంతో పాటు నలుగురు, ఐదుగురికి మించి గుంపులుగా వచ్చే వారిని అడ్డుకున్నారు. హరీశ్‌రావు విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్నారన్న సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు అప్రమత్తమయ్యారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం హరీశ్‌రావును పోలీసులు సుబేదారి స్టేషన్‌కు తీసుకెళ్లారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

**'నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు'**

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. జీవో 97పై ప్రశ్నిస్తున్న నాయకులను, విద్యార్థులకు మద్దతుగా నిలుస్తున్న వారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కుల హననమన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, పేదల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడతామని పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం

- జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి రావాలని ఆహ్వానం
- విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించి ప్రత్యేక ఉపన్యాసం ఇవ్వాలని విజ్ఞప్తి

**కాకతీయ, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హర్యానాలోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ నుంచి ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. యూనివర్సిటీకి వచ్చి విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతో పాటు 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి. రాజ్‌కుమార్ లేఖ ద్వారా ఆహ్వానించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో కేటీఆర్‌కు అనుకూలమైన తేదీలో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత్‌లో తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కోరారు. ఆహ్వానానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలుపుతూ, విద్యార్థులతో సంభాషించేందుకు ఆసక్తిగా ఉన్నానని, తప్పకుండా హాజరవుతానని వెల్లడించారు.

# నేపాల్ వరదల్లో హైదరాబాద్ యువతి గల్లంతు

- మానస సరోవర్ యాత్రకు వెళ్లిన సుహాసిని రెడ్డి ఆచూకీ గల్లంతు
- మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఫోన్‌కు స్పందన కరవు
- నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణవాసులు 23 మంది: మంత్రి పొంగులేటి
- కుటుంబసభ్యుల ఆందోళన.. సురక్షితంగా తీసుకురావాలని వేడుకోలు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : నేపాల్‌లో వరదల బీభత్సంలో హైదరాబాద్‌కు చెందిన యువతి గల్లంతైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎల్‌బీనగర్ వాస్తు కాలనీకి చెందిన సుహాసిని రెడ్డి మానస సరోవర్ యాత్రకు వెళ్లి అదృశ్యమయ్యారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఆమె ఫోన్‌కు స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నేపాల్‌లో వరదలు సంభవించినట్లు సమాచారం అందడంతో సుహాసిని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. ఆమెను సురక్షితంగా గుర్తించి స్వదేశానికి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.



### స్నేహితురాలితో కలిసి యాత్రకు..

ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుహాసిని ఈ నెల 19న హైదరాబాద్‌కు వచ్చారు. మానస సరోవర్ యాత్ర కోసం మూడు నెలల క్రితమే ఆస్ట్రేలియాకు చెందిన తన స్నేహితురాలితో కలిసి టికెట్లు బుక్ చేసుకున్నారు. సుహాసిని హైదరాబాద్ నుంచి నేపాల్‌కు వెళ్లగా.. ఆమె స్నేహితురాలు ఆస్ట్రేలియా నుంచి కాఠ్‌మాండుకు చేరుకున్నారు. అక్కడ ఇద్దరూ కలుసుకున్నారు. అనంతరం టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ద్వారా మొత్తం 29 మంది యాత్రకు బయలుదేరినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి సుహాసిని ఫోన్‌కు స్పందన లేకపోవడంతో ఆందోళనకు గురయ్యామని ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

### 23 మంది తెలంగాణవాసులు చిక్కుకున్నారు

నేపాల్ వరదల పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో తెలంగాణకు చెందిన 23 మంది చిక్కుకున్నట్లు గుర్తించామని తెలిపారు. వారి వివరాలను విదేశాంగ శాఖకు పంపించామని, కేంద్రం, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నామని వెల్లడించారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### అత్యవసర హెల్ప్‌లైన్‌లు

భారతీయుల సమాచారం కోసం నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాఠ్‌మాండులోని రాయబార కార్యాలయాన్ని +977 985 131 6807, +977 970 910 7500, +977 981 032 6117 నంబర్లలో వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చు. భారత్‌లో ఏర్పాటు చేసిన 24 గంటల ప్రత్యేక నియంత్రణ గదిని +91 11 2308 8718, +91 11 2308 8719 నంబర్లలో సంప్రదించవచ్చు. వాట్సాప్ కాల్స్, సందేశాల కోసం +91 9968291988 నంబర్‌ను వినియోగించవచ్చు. ఢిల్లీలోని హెల్ప్‌లైన్ నంబర్లు 9871999044, 9949351270, 9618597969 కాగా.. సచివాలయంలో 9885371189, 7997959754, 9440854433 నంబర్లను ఏర్పాటు చేశారు.

---

## ఓటరు జాబితా సవరణలో
# అందరూ భాగస్వాములు కావాలి

- పేర్లు, చిరునామాల్లో తప్పులుంటే సరిచేసుకోవాలి
- ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తుకు అవకాశం
- నడికూడ ఎంపీడీఓ రామకృష్ణ



కాకతీయ, నడికూడ: ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నడికూడ ఎం.పీ.డీ.ఓ రామకృష్ణ సూచించారు. గురువారం చర్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలకు ఫారం–6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు జాబితాను చదివి వినిపించారు. వలస వెళ్లిన, మృతి చెందిన, ఆచూకీ లేని, డూప్లికేట్ ఓటర్ల వివరాలను పరిశీలనకు ఉంచారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు, బీఎల్‌ఓలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పుతిన్‌తో మోదీ భేటీ..

- ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చలు
- ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో పర్యటన
- బిష్కెక్‌లో ఎస్‌సీఓ సదస్సు.. పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు
- భారత్-రష్యా సంబంధాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై సమీక్ష



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో ఆయన పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించే అవకాశం ఉందని విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు మోదీ బిష్కెక్‌లో ఎస్‌సీఓ సదస్సుకు హాజరవుతారు. సెప్టెంబరు 1న జరిగే ప్లీనరీలో ప్రసంగించనున్నారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్' ప్రారంభోత్సవంలోనూ ఇతర ఎస్‌సీఓ దేశాల నేతలతో కలిసి పాల్గొంటారు. సదస్సు సందర్భంగా ఇతర దేశాల అధినేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఆయా నేతల అందుబాటు, సమయానుకూలత ఆధారంగా భేటీల షెడ్యూల్ ఖరారు చేయనున్నారు.

### ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు..

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్ వెళ్లనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో మోదీ పర్యటించడం ఇది నాలుగోసారి కాగా.. ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి. మిర్జియోయెవ్‌తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపి భారత్–ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరిస్తోంది. ఉజ్బెకిస్థాన్‌లో 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు కొనసాగుతున్నాయి.

---

## మీనాక్షి నటరాజన్..
# తెలంగాణలో తేలిపోయారా?



- వర్గపోరుకు చెక్ పెట్టడంలో విఫలమయ్యారన్న చర్చ
- గీత దాటుతున్న నేతలపై కొరవడిన కఠిన చర్యలు
- రేవంత్–సీనియర్ల మధ్య విభేదాలు పరిష్కరించడంలో జాప్యం
- ఇన్‌ఛార్జ్ వైఖరిపై కాంగ్రెస్ వర్గాల్లోనే అసంతృప్తి?

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరు, ఆధిపత్య పోరు, అసమ్మతి స్వరాలు కొనసాగుతుండటంతో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పనితీరుపై పార్టీలోనే చర్చ మొదలైంది. రాహుల్‌గాంధీకి సన్నిహితురాలిగా, అవినీతి రహిత రాజకీయ నాయకురాలిగా ఉన్న ఆమెకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించినప్పుడు కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలకు చెక్ పడుతుందని అధిష్ఠానం భావించింది. అయితే రాష్ట్రంలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేతల మధ్య విభేదాలు తరచూ బహిరంగమవుతున్నా.. వాటిని ప్రారంభ దశలోనే కట్టడి చేసే స్థాయిలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ ప్రభావం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీభవన్ వేదికగా ఆధిపత్య పోరు, నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కిన సందర్భాల్లో సమీక్షలు, అంతర్గత చర్చలు, కమిటీల ఏర్పాటుతోనే వ్యవహారం ముగుస్తోందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సందర్భాల్లోనూ రాజీ ధోరణే కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అధిష్ఠానం ఆదేశాలను ధిక్కరించినా పెద్దగా ఇబ్బంది ఉండదనే భావన కొందరు నేతల్లో ఏర్పడుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అసమ్మతిని పరిష్కరించేందుకు చర్చలు అవసరమే అయినా.. పార్టీ గీత దాటే నేతలకు స్పష్టమైన హెచ్చరికలు, చర్యలు లేకపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

### రేవంత్–సీనియర్ల మధ్య సమన్వయం ఏదీ?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్న రాజకీయ పట్టు, మరోవైపు మంత్రులు, సీనియర్ నేతల మధ్య నెలకొంటున్న విభేదాల మధ్య సమన్వయం సాధించడం ఇన్‌ఛార్జ్‌కు కీలక బాధ్యతగా మారింది. అయితే మంత్రుల మధ్య అంతర్గత విభేదాలు, కొండా సురేఖ వ్యవహారం వంటి అంశాలు బహిరంగ చర్చకు వచ్చినా.. వాటిని సమర్థంగా పరిష్కరించడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీకి నష్టం కలిగించే పరిణామాలను ముందుగానే అడ్డుకోకుండా.. అవి రచ్చకెక్కిన తర్వాత అధిష్ఠానానికి నివేదికలు పంపడానికే పరిమితమవుతున్నారన్న వ్యాఖ్యలు ఉన్నాయి. దీంతో సీఎం వర్గానికి, ఇతర సీనియర్ నేతలకు మధ్య దూరం తగ్గించడంలోనూ ఆశించిన ఫలితం కనిపించడం లేదన్న చర్చ సాగుతోంది.

### రాజకీయంగా ఎదురుదెబ్బలేనా?

మీనాక్షి నటరాజన్ రాజకీయ ప్రయాణంలో ఎదురైన కొన్ని పరిణామాలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేసినప్పటికీ.. నామినేషన్ తిరస్కరణకు గురైన అంశం ఆమెకు రాజకీయంగా ఎదురుదెబ్బగా మారిందన్న విశ్లేషణలు ఉన్నాయి. అయితే తెలంగాణ కాంగ్రెస్‌లో ఆమె పనితీరును దీనితో నేరుగా ముడిపెట్టడం సరికాదన్న అభిప్రాయమూ ఉంది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాజకీయ వాతావరణంలో వర్గాలను సమన్వయం చేయాలంటే కేవలంమంచి వ్యక్తిగత ఇమేజ్ సరిపోదని.. అవసరమైన సమయంలో కఠిననిర్ణయాలు తీసుకునే రాజకీయసామర్థ్యం కూడాకీలకమనిపార్టీవర్గాలుచెబుతున్నాయి.

### మార్పు తప్పదా?

తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాలు మరింత ముదరకుండా చూడాలంటే ఇన్‌ఛార్జ్ వ్యవస్థ మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే నేతలపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం, ముఖ్యమంత్రి–మంత్రులు–సీనియర్ నేతల మధ్య సమన్వయం పెంచడం, వివాదాలు బహిరంగం కాకముందే పరిష్కరించడం ఇప్పుడు కీలకమని పార్టీ శ్రేణులు అంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మీనాక్షి నటరాజన్ తన వ్యూహాన్ని మార్చుకుంటారా? లేక తెలంగాణ కాంగ్రెస్‌కు అధిష్ఠానం ప్రత్యామ్నాయ వ్యూహాన్ని సిద్ధం చేస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

---

## తుమ్మిడిహెట్టి ఆనకట్టపై
# ఢిల్లీలో కీలక భేటీ

- సెప్టెంబరు 1న కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం
- తెలంగాణ–మహారాష్ట్ర మధ్య సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చ

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన తుమ్మిడిహెట్టి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర, ముంపు అంశాలపై చర్చించేందుకు సెప్టెంబరు 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో నిర్వహించనున్న ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రధానమంత్రి కార్యాలయం ఈ లేఖను జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం లేఖ రాసి జోక్యం చేసుకోవాలని కోరారు. దీంతో రెండు రాష్ట్రాలతో సంప్రదింపులుజరపాలని కేంద్ర జలసంఘం ఛైర్మన్‌ను జలశక్తి శాఖ ఆదేశించింది.

### 152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ యత్నం

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి గతంలో మహారాష్ట్రతో ఒప్పందం కుదిరింది. అయితే 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తరలించడం సాధ్యం కాదని.. భారీ పంపులను వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టును నిర్మించాలన్నది తమ ఉద్దేశమని పేర్కొంది. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం నీటి లభ్యత పెరగడంతో పాటు అదనంగా ఏర్పడే ముంపు కూడా పరిమితంగానే ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1న జరిగే సమావేశంలో ఆనకట్ట ఎత్తు, నీటి లభ్యత, విద్యుత్ వ్యయం, ముంపు ప్రభావం తదితర సాంకేతిక అంశాలతో పాటు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అంతర్రాష్ట్ర అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

---

## పెరోల్‌పై బయటకొచ్చి..
# 40 ఏళ్లుగా పరారీలో

- హత్య కేసులో జీవిత ఖైదు.. గడువు ముగిసినా జైలుకు వెళ్లని ఖైదీ
- ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం.. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు
- పదవీ విరమణ తర్వాత పెన్షన్.. చివరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన వైనం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : హత్య కేసులో జీవిత ఖైదు పడిన ఓ ఖైదీ పెరోల్‌పై బయటకు వచ్చి.. గడువు ముగిసిన తర్వాత తిరిగి జైలుకు వెళ్లకుండా ఏకంగా 40 ఏళ్లకుపైగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరారీలో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి దాదాపు మూడు దశాబ్దాలపాటు పనిచేయడం.. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోవడం.. పదవీ విరమణ అనంతరం పెన్షన్ పొందడం విస్మయం కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. పెరోల్‌పై విడుదలైన ఖైదీలు గడువు ముగిసిన వెంటనే తిరిగి జైలుకు చేరుతున్నారా? లేదా? అన్నది అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పెరోల్ ఖైదీలపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జైళ్ల శాఖను ఆదేశించింది.

### 1984లో జైలుకు వెళ్లాల్సి ఉండగా..

మహబూబాబాద్ జిల్లా పెద్దముప్పారం గ్రామానికి చెందిన సందుల వీరన్నపై 1982లో హత్య కేసు నమోదైంది. విచారణ అనంతరం 1983 జూన్ 9న వరంగల్ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆయనకు జీవిత ఖైదు విధించారు. దీంతో వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. అదే ఏడాది డిసెంబరు 17న 30 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చిన వీరన్నకు 1984 మార్చి 17 వరకు గడువు పొడిగించారు. మార్చి 18న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉన్నా ఆయన వెళ్లలేదు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్ల 58 రోజులపాటు పోలీసులకు చిక్కకుండా బయటే ఉన్నారు.

### ఉపాధ్యాయుడిగా సేవలు.. అవార్డు

పరారీలో ఉన్న సమయంలో వీరన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించారు. దాదాపు 30 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2004లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును కూడా అందుకున్నారు. 2013లో పదవీ విరమణ చేసి పెన్షన్ పొందుతూ జీవిస్తున్నారు. ఇన్నేళ్లపాటు ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేసినా ఆయన గురించి అధికారులకు తెలియకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. చివరకు 2024 మే 16న వరంగల్ సెంట్రల్ ప్రిజన్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఆయన ఆచూకీ గుర్తించి అరెస్టు చేసింది. అనంతరం తిరిగి జైలుకు తరలించారు.

### పెరోల్ రద్దు.. భార్య పిటిషన్ కొట్టివేత

వీరన్నకు 2024 సెప్టెంబరు 10న మరోసారి 27 రోజుల పెరోల్ మంజూరైంది. అయితే నిబంధనల ఉల్లంఘన కారణంగా జైలు అధికారులు దానిని రద్దు చేసి.. మూడేళ్లపాటు పెరోల్ ఇవ్వకూడదని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరన్న భార్య సండెల చారమ్మ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను జస్టిస్ టి. మాధవీదేవి కొట్టివేశారు. పెరోల్ గడువు ముగిసిన వెంటనే ఖైదీలు తిరిగి జైలుకు చేరేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వానికి, జైళ్ల శాఖకు సూచించారు.

---

## ఎన్‌హెచ్–65
# విస్తరణపై ఫోకస్

- 17 బ్లాక్‌స్పాట్లలో ఫ్లైఓవర్ల నిర్మాణం
- డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలి
- చిట్యాల వంతెన దసరాకు సిద్ధమవ్వాలి
- సంక్రాంతి నాటికి అన్నీ అందుబాటులోకి
- ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష



కాకతీయ,తెలంగాణ బ్యూరో : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–65)పై వరుస ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో చేపట్టిన ఫ్లైఓవర్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడంతో పాటు.. రహదారిని విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం సచివాలయంలో ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇతర ప్రమాదాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్–విజయవాడ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్న 17 బ్లాక్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. అక్కడ ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టడంతో పాటు హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రికి వివరించారు. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్ల పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. పెద్దకాపర్తి ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలకు అనుమతి లభించగా.. సూర్యాపేట ఫ్లైఓవర్ కూడా ట్రాఫిక్‌కు సిద్ధంగా ఉందన్నారు. చిట్యాల ఫ్లైఓవర్‌ను దసరా నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిగిలిన వాటిని డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి.. సంక్రాంతి నాటికి మొత్తం 17 ఫ్లైఓవర్లను వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

### 6+2 లేన్లుగా విస్తరించాలి

ఎన్‌హెచ్–65పై ప్రమాదాలను శాశ్వతంగా తగ్గించాలంటే రహదారి విస్తరణే కీలకమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రహదారిని 6+2 లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి గడ్కరీని కలిసి విస్తరణ పనులను వేగవంతం చేయాలని కోరుతామని చెప్పారు. అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

# మేడారంలో ఇసుక దోపిడి!







- జంపన్నవాగులో యథేచ్ఛగా తవ్వకాలు..
- టిప్పర్లతో భారీగా రవాణా.....
- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ తవ్వకాలు?
- కన్నెత్తి చూడని అధికారులు..
- ప్రజాప్రతినిధుల పాత్రపై అనుమానాలు.....

కాకతీయ ములుగు ప్రతినిధి: సమ్మక్క–సారలమ్మ వనదేవతల జాతరతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మేడారం ఇప్పుడు ఇసుక అక్రమ తవ్వకాల ఆరోపణలతో వార్తల్లోకి ఎక్కుతోంది. జాతర ముగిసిన అనంతరం జనసంచారం తగ్గడాన్ని ఆసరాగా చేసుకున్న ఇసుక అక్రమ రవాణాదారులు జంపన్నవాగును టార్గెట్‌గా చేసుకుని భారీగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి ఒడ్డుకు తరలించడం, అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో..?

స్థానికుల ఆరోపణల ప్రకారం మేడారం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అవసరాల పేరుతో జంపన్నవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఇసుక తవ్వకాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఎంత పరిమాణంలో ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇచ్చారు? అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టి, ఒడ్డున నిల్వ చేసి అనంతరం టిప్పర్ల ద్వారా బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు జంపన్నవాగు సహజ స్వరూపానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పట్టపగలే టిప్పర్ల రాకపోకలు.....

జంపన్నవాగు నుంచి తవ్విన ఇసుకను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకటి రెండు టిప్పర్లు కాకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు ఇసుకను తరలిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. రోజుల తరబడి తవ్వకాలు కొనసాగుతున్నా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు.

### గతంలో టిప్పర్ పట్టుబడినా..

మేడారం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారంలో గత నెలలో నార్లాపూర్ వద్ద అధికారులు ఓ టిప్పర్‌ను గుర్తించి పట్టుకోవడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. మేడారం ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను అధికారులు పట్టుకున్న ఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ, ఆ తర్వాత కూడా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ....?

జంపన్నవాగులో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం వాగు ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి రాలేదా? లేక తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక తవ్వకాలపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలకు దూరంగా ఉండటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నప్పటికీ చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని భక్తులు అంటున్నారు.

### ప్రజాప్రతినిధుల ప్రమేయంపై ఆరోపణలు....

ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు తెలియకుండా ఉండటం సాధ్యమేనా? అనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రపై సమగ్రంగా దర్యాప్తు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు. మేడారం జాతరతో పాటు జంపన్నవాగుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉన్న ఈ ప్రాంతంలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వడం వల్ల భవిష్యత్‌లో పర్యావరణపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగు సహజ ప్రవాహానికి, భూగర్భ జలాలపై ప్రభావం పడకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఎంత మేరకు అనుమతించారు? ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తీసిన ఇసుక వాస్తవంగా ఎక్కడ వినియోగిస్తున్నారు? ఎన్ని టిప్పర్ల ద్వారా ఇసుక తరలించారు? ప్రభుత్వానికి ఎంత మేర ఆదాయం వచ్చింది? అనే అంశాలపై అధికారులు పారదర్శకంగా వివరాలు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కాటాపూర్ పీహెచ్‌సీలో ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ

- రోగుల వివరాలు, రిజిస్టర్ల నిర్వహణపై పరిశీలన
- ఆసుపత్రి పరిశుభ్రత, సిబ్బంది సమయపాలనపై ఆదేశాలు
- మందుల నిల్వ, పంపిణీ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి
- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : తాడ్వాయి మండలం కాటాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డులోని ఇన్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతిరోజూ ఆసుపత్రిలో చేరుతున్న రోగుల వివరాలు, రిజిస్టర్లలో నమోదవుతున్న సమాచారాన్ని తనిఖీ చేశారు. అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతోపాటు వార్డును పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల సహాయకులతో మాట్లాడిన పీఓ.. వారి నివాస ప్రాంతం, నమోదైన కేసులు, వైద్యులు, సిబ్బంది అందుబాటుపై వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణకు ఆయా నివాస ప్రాంతాల్లో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ (ఐఆర్‌ఎస్) నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని నివాస ప్రాంతాల్లో ఐఆర్‌ఎస్ కవరేజీ పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మందుల నిల్వ గదిని తనిఖీ చేసి మందుల తయారీ, గడువు తేదీలను పరిశీలించారు. మందులను సక్రమంగా వేరు చేసి నిల్వ చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన, రోగులకు పంపిణీ చేసిన మందుల స్టాక్ వివరాలను రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను కూడా పరిశీలించిన పీఓ.. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని ఆదేశించారు. ఫార్మసీని తనిఖీ చేసి రోగులకు మందుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. మందులు అందజేసే సమయంలో రోగి వివరాలను సక్రమంగా పరిశీలించి, సరైన మందులు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగుల రికార్డులను పద్ధతిగా నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీలో డాక్టర్ స్నిగ్ధ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య విస్తరణ అధికారి, వైద్య సిబ్బంది పీఓ వెంట ఉన్నారు.

## పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి



కాకతీయ, పెద్దవంగర: పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా బోనగిరి వేణుమాధవ్, శ్రీధర్, జిల్లా కార్యదర్శులుగా సురేందర్, రవీందర్ ఎన్నికయ్యారని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యాకుబ్‌పాషా తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవంగర మండలానికి చెందిన వారికి జిల్లా స్థాయి పదవులు దక్కడం సంతోషకరమన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- బోధనతోపాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి
- విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర
- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



కాకతీయ, జనగామ : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. గురువారం పాలకుర్తి మండలంలోని పీఎం శ్రీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హిందీ, ఇంగ్లిష్, గణితం, సాంఘికశాస్త్రంలో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. బ్లాక్‌బోర్డుపై గణితం, సాంఘికశాస్త్ర అంశాలను స్వయంగా బోధించారు. పాఠ్యాంశాల పూర్తిపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకునేలా బోధించాలని సూచించారు. చదువుతోపాటు చెస్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పాత బెంచీలను మరమ్మతు చేసి ఇతర పాఠశాలలకు తరలించాలని, ప్రత్యేక గదిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. దెబ్బతిన్న కిటికీలు, ఫ్యాన్లు, తరగతి గదుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, కంప్యూటర్, కోడింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేదవతి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం



- పీఆర్సీ, డీఏలు ఇవ్వడానికి నిధులు లేవా?
- ఫ్యూచర్ సిటీ, మూసీకి వేల కోట్లు.. ఉద్యోగులకు మాత్రం మొండిచేయి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి

కాకతీయ, హన్మకొండ : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట టీ జీ ఈ జేఏసీ, టీ జీఓ, టీ ఎన్ జీఓ ఉద్యోగ సంఘాలు చేపట్టిన ధర్నాకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని రాకేష్ రెడ్డి అన్నారు. ఉద్యోగులు కేవలం ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే కాదని, ఉద్యమకారులు కూడా అని పేర్కొన్నారు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేయడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. ఉద్యమ సమయంలో ఉద్యోగులే కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వంలో ఉద్యోగులు పాత్రధారులు మాత్రమే కాదని, పాలనలో సూత్రధారులని అన్నారు.

### పీఆర్సీ, డీఏలకు నిధులేవి?

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉద్యోగ సంఘాల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు రేవంత్‌రెడ్డికి గుర్తు రావడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో దేశ చరిత్రలోనే తొలిసారిగా 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారని, 2021లో పీఆర్సీ కమిటీ 7.5 శాతం ఫిట్‌మెంట్ సిఫారసు చేసినప్పటికీ 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారని గుర్తుచేశారు. 2014కు ముందు 30 ఏళ్లలో 110 శాతం పీఆర్సీ ఇస్తే.. తొమ్మిదేళ్లలో రెండు పీఆర్సీలను కలిపి 78శాతం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఎమ్మెల్యేల జీతాలు, అలవెన్సులు పెంచుకోవడానికి నిధులున్నప్పుడు ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలుఇవ్వడానికి మాత్రం నిధులు లేవా? అని నిలదీశారు.

### ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వం ఉద్యోగుల హక్కులైన పీఆర్సీ, డీఏలు, పదవీ విరమణ ప్రయోజనాలకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల నుంచి 1.5 శాతం ఈహెచ్‌ఎస్ పేరుతో కోతలు వేస్తూ.. ప్రైవేటు ఆసుపత్రులతో మాట్లాడి ఈహెచ్‌ఎస్ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల సమస్యలపై కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర రాజధానిలో దీక్ష కూడా చేస్తామని హామీఇచ్చారని తెలిపారు. ఉద్యోగులహక్కులకోసం బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముసాయిదా ఓటరు జాబితాపై పరిశీలన

- గ్రామ, వార్డు సభల్లో జాబితాల ప్రదర్శన
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నిర్ధారించుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



కాకతీయ, మహబూబాబాద్ : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026లో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల వార్డుల్లో ప్రత్యేక గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. ఈ సభల్లో ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. సిరోలు మండలం చిలుక్కోడులో నిర్వహించిన సభలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొని ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన అర్హులు తమ పేర్లను జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేకుంటే ఫారమ్–6, వివరాల్లో తప్పులుంటే ఫారమ్–8, మరణించిన లేదా శాశ్వతంగా తరలిన వారి పేర్ల తొలగింపునకు ఫారమ్–7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 'వోటర్ హెల్ప్‌లైన్ యాప్', ఎన్‌వీఎస్‌పీ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నెలరోజుల్లోగా నిర్ధారణ పత్రాలు సమర్పించి ఓటు హక్కును భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ పున్నం చందర్, అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## మచ్చ కుమారస్వామి ఇకలేరు

- రోడ్డు ప్రమాదంలో అకాల మృతి
- కుటుంబానికి సంఘాల ఆర్థిక సాయం
- భారీగా తరలివచ్చిన బంధువులు, నాయకులు




కాకతీయ, వరంగల్ : నగరంలోని రంగసాయిపేటకు చెందిన శ్రీరామ ట్రాలీ యూనియన్ అధ్యక్షుడు మచ్చ కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వివిధ పరపతి సంఘాల ప్రతినిధులు, ట్రాలీ యూనియన్ నాయకులు, కుల సంఘాల పెద్దలు, మాజీ కార్పొరేటర్ గుండు చందన–పూర్ణచందర్, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. మిత్ర పరపతి సంఘం, జనతా పరపతి సంఘం ప్రతినిధులు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. లెనిన్‌నగర్‌లోని నివాసం నుంచి అంతిమ యాత్ర రంగసాయిపేట గౌచర్ల జంక్షన్, మహంకాళి, బొడ్రాయి సెంటర్, రజక, యాదవ్‌నగర్ మీదుగా కొనసాగింది. బైపాస్ రోడ్డు సమీపంలోని రజక స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# పాత కక్షలతో యువకుడి హత్య





- నేతాజీ గ్రౌండ్‌లో శివపై మూకుమ్మడి దాడి
- ఫోన్ చేసి పిలిచి దాడి.. ఆసుపత్రికి తరలించేలోపే మృతి
- మణుగూరు పోలీసులు దర్యాప్తు ముమ్మరం



కాకతీయ, మణుగూరు : మణుగూరులో పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నేతాజీ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన మూకుమ్మడి దాడిలో సింహాద్రి శివకుమార్ అలియాస్ శివ (28) తీవ్రంగా గాయపడి గురువారం మృతి చెందాడు. హైదరాబాద్‌లో ఇంటీరియర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న శివను ఫోన్ చేసి గ్రౌండ్‌కు పిలిపించి దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనతో మణుగూరులో ఉద్రిక్తత నెలకొంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివ వద్ద పనిచేసే సుందరయ్యనగర్‌కు చెందిన సతీష్‌తో గతంలో జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న ఎంకే గ్యాంగ్ నాయకుడు రమాకాంత్ అలియాస్ రమ్మీ అలియాస్ జెట్టి, అతని అనుచరులు శివ మణుగూరుకు వస్తే చంపేస్తామని ఫోన్‌లో బెదిరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు శివ హైదరాబాద్ నుంచి మణుగూరుకు వచ్చాడు. అనంతరం రమాకాంత్ అలియాస్ జెట్టి ఫోన్ చేసి నేతాజీ గ్రౌండ్‌కు రావాలని పిలవడంతో ఇంటి పక్కన ఉండే ఉదయ్‌కుమార్‌తో కలిసి అక్కడికి వెళ్లాడు. అప్పటికే అక్కడ వేచి ఉన్న రమాకాంత్ అలియాస్ జెట్టి, భరత్, సాధిక్, వినయ్, ధినేష్, జంపయ్య, ప్రసాద్ తదితరులు శివపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉదయ్‌కుమార్‌పై కూడా దాడి చేసినట్లు తెలిపారు.

**ఆసుపత్రికి తరలించేలోపే..**

దాడిలో తీవ్రంగా గాయపడిన శివను కుటుంబ సభ్యులు గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శివ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శివ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఘటనలో పాల్గొన్న వారందరినీ అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. మణుగూరులో యువకుల గ్యాంగ్‌లు ఏర్పడి రాత్రివేళల్లో గుంపులుగా తిరగడం, బైక్‌లపై స్టంట్లు చేయడం, ముగ్గురు చొప్పున ప్రయాణించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాదకద్రవ్యాల ప్రభావంతో కొందరు యువకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రాణనష్టాలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం**

ఘటనపై సమాచారం అందుకున్న మణుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి దారితీసిన కారణాలు, ఘటనలో పాల్గొన్న వారి వివరాలు, శివ మృతికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. గ్రౌండ్‌లో జరిగిన దాడికి సంబంధించిన వీడియో ఆధారాలను సేకరిస్తున్నట్లు సమాచారం. నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

## కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటం

- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్
- ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి




కాకతీయ, చేర్యాల : కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించేది ఏఐటీయూసీ మాత్రమేనని ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్ అన్నారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో కలిసి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. 1920లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ 105 సంవత్సరాలుగా కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. అసంఘటిత రంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, నిర్మాణ కార్మికులు సహా అన్ని వర్గాల శ్రామికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్రె ఆంజనేయులు, పాల సాయిరెడ్డి, ఈరి భూమయ్య, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, పోషబోయిన పరమశేఖర్, బియ్య బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలి

- ఎరువుల విక్రయాల్లో అవినీతిని అరికట్టాలని డిమాండ్
- ఎమ్మార్పీ ధరలకే యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వాలి
- ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో



కాకతీయ, చేర్యాల: రైతులకు అవసరమైన మేరకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే అందించాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో మాట్లాడుతూ.. యూరియా ఫర్టిలైజర్ యాప్ విధానం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని, వెంటనే దాన్ని రద్దు చేయాలని కోరారు. ఎరువుల దుకాణాల్లో నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు యూరియా సకాలంలో అందడం లేదని ఆరోపించారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులను విక్రయించడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరం లేని ఇతర ఉత్పత్తులను కూడా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడాన్ని నిలిపివేయాలని కోరారు. వ్యవసాయ శాఖలో ఏవో, ఏడీఏ వంటి శాశ్వత అధికారులను నియమించి ఎరువుల విక్రయాలను పర్యవేక్షించాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే వారిని సమీకరించి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగపురి కనకయ్య, తుప్పతిరాజు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీలో రాజకీయ రచ్చ

- మోదీ ఫొటోపై బీజేపీ ప్రశ్న.. ఆది శ్రీనివాస్ కౌంటర్
- నినాదాలతో వేడెక్కిన వాతావరణం.. తోపులాటతో ఉద్రిక్తత
- రాజకీయాలు చేయొద్దు.. అభివృద్ధిలో కలిసి సాగాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



కాకతీయ, రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రాజకీయ రచ్చకు దారితీసింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. కేంద్రం ఉచిత బియ్యం అందిస్తున్నందున స్మార్ట్ రేషన్ కార్డుపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణుగోపాల్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని ఆది శ్రీనివాస్ బదులిచ్చారు. దీంతో బీజేపీ నేతలు 'కాంగ్రెస్ డౌన్ డౌన్.. దోపిడీ రాజ్యం' అంటూ నినాదాలు చేశారు. కేంద్రం నుంచి మండలానికి నిధులు తీసుకురాలేదంటూ కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడికి దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చిన్న విషయాలకు రాజకీయాలు చేయకుండా అభివృద్ధిలో కలిసికట్టుగా సాగాలని ఆది శ్రీనివాస్ సూచించారు.

## సంపత్‌గౌడ్ మృతిపై మంత్రి పొన్నం సంతాపం

కాకతీయ, హుస్నాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ మాజీ సర్పంచ్ దూడల సంపత్‌గౌడ్ ఆకస్మిక మృతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంపత్‌గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి, నియోజకవర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. సంపత్‌గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సంపత్‌గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించేలా పార్టీ శ్రేణులు అండగా నిలవాలని సూచించారు.

## మాలల ఛలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయండి

**జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ**



కాకతీయ,చేర్యాల: మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అగస్టు 31న జరిగే మాలల ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.చేర్యాల అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో సెక్రటేరియట్‌కు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, జీఓ 99లో రోస్టర్ పాయింట్ల కేటాయింపును సవరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చింతల విజయ్ కుమార్, శ్రీరాం వెంకటేష్, చంద శ్రీకాంత్, గుసక వాసంతి, పాకనాటి భాస్కర్, బుట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లయ్యకుంటకు గండం.. గ్రామానికి పెను ముప్పు!

- గండిపడి ప్రమాదకరంగా మారిన చెరువు
- అత్యవసర మరమ్మతులకు మట్టి కేటాయించాలని వినతి
- త్వరలో రక్షణ చర్యలు చేపడతాం : అటవీ శాఖ అధికారి భూలక్ష్మి



కాకతీయ, చందుర్తి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవుని తండాలోని ఎల్లయ్యకుంట చెరువు ప్రమాదకర స్థితికి చేరుకుంది. చెరువుకు గండి పడటంతో ఎప్పుడు తెగిపోతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ముప్పు మరింత పెరిగే అవకాశం ఉండటంతో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు సర్పంచ్ భుక్య మోహన్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు భుక్య గబ్బర్‌సింగ్ అటవీ శాఖ అధికారి భూలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. చెరువు తెగిపోతే గ్రామానికి తాగునీరు, రైతులకు సాగునీటితోపాటు వన్యప్రాణులకు నీటి వనరు దెబ్బతింటుందని తెలిపారు. గండికి తక్షణ రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన మట్టిని అత్యవసరంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆలస్యం చేస్తే సమస్య తీవ్రతరమవుతుందని పేర్కొన్నారు. దీనిపై భూలక్ష్మి సానుకూలంగా స్పందించి, మరమ్మతులకు అవసరమైన మట్టిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## పన్నుల వసూళ్లపై ఉక్కు పాదం



**అదనపు కమిషనర్ జోనా సమీక్ష**

**అసెస్‌మెంట్లు, పెండింగ్ కేసులు వేగంగా పరిష్కరించాలి**

**రెవెన్యూ అధికారులకు ఆదేశం**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : పన్నుల సేకరణ, అసెస్‌మెంట్ల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ జోనా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రత్యేకాధికారి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఈ నెల 12న సమీక్షించిన నేపథ్యంలో, కమిషనర్ టి వెంకన్న ఆదేశాల మేరకు గురువారం అదనపు కమిషనర్ జోనా సర్కిళ్ల వారీగా ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పెండింగ్ లో ఉన్న అసెస్ మెంట్, అన్ కలెక్టబుల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నగరంలో పన్ను పరిధిలోకి రాని అపార్ట్‌మెంట్లు, భవనాలను గుర్తించి వెంటనే అసెస్ మెంట్ చేసి పన్ను పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పురోగతి నివేదికను కమిషనర్ కు సమర్పించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, రామకృష్ణ, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం బొడ్రాయి అభివృద్ధి పనులు



కాకతీయ,గీసుగొండ : తండ్రి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఆయన తనయులు రడం భరత్, రడం బాను ప్రకాష్ రాంపూర్ గ్రామంలోని బొడ్రాయి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో స్వర్గీయ రడం వీరస్వామి జ్ఞాపకార్థంగా ఆయన తనయులు తమ సొంత నిధులతో రూ.1 లక్ష వెచ్చించి బొడ్రాయి అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో గతంలో నిర్మించిన బొడ్రాయికి గ్రానైట్ కాంక్రీట్ ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ రైలింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు.తండ్రి జ్ఞాపకార్థం గ్రామానికి ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్వర్గీయ రడం వీరస్వామి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఆయన తనయులు ముందుకు వచ్చి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ రడం వీరస్వామి సతీమణి, గీసుగొండ మాజీ సర్పంచ్ రడం వినోద, రాంపూర్ గ్రామ ఉపసర్పంచ్ పులి సూరయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి**



కాకతీయ, గీసుగొండ : కారు–ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గీసుగొండ మండలంలో చోటుచేసుకుంది. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలం వంజరపల్లికి చెందిన గోనె సమ్మయ్య (70) వ్యవసాయ పనిముట్ల వెల్డింగ్ పనిపై గురువారం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కొమ్మాల వైపు వెళ్తుండగా కొమ్మాల స్టేజీ–దస్రుతండా మధ్య ప్రమాదం జరిగింది. నర్సంపేట నుంచి వరంగల్ వైపు వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు డ్రైవర్ వనంప్రమోద్ కుమార్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి సమ్మయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. కారు కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో తీవ్ర గాయాలై సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సరోజన ఫిర్యాదుతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఉద్యానవన అధికారిగా ప్రశాంత్

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, కమిషనర్ వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : జీడబ్ల్యూఎంసీ నూతన హార్టికల్చర్ అధికారిగా నియమితులైన తిరునగరి ప్రశాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ని, బాలసముద్రం క్యాంప్ కార్యాలయంలో బల్దియా కమిషనర్ టి వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ ప్రశాంత్ కు శుభాకాంక్షలు తెలిపి, నగరంలో పచ్చదనం పెంపు, పార్కుల అభివృద్ధి, మొక్కల సంరక్షణ, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశాంత్ గతంలో వరంగల్ జిల్లా పర్వత గిరి మండల వ్యవసాయాధికారిగా పనిచేశారు.

## ములుగు జిల్లాలో టీజీఈజేఏసీ మహాధర్నా

- డిమాండ్ల సాధనకు ఉద్యోగుల ఆందోళన
- 2వ పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ పోలు రాజు ఆధ్వర్యంలో ధర్నా




కాకతీయ, ములుగు ప్రతినిధి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ములుగు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. జిల్లా చైర్మన్ పోలు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 2వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏ, డీఆర్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు నూతన ఈహెచ్ఎస్ వైద్య పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీజీఓ కార్యదర్శి కె.జీవన్‌కుమార్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు వి.యాకుబ్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ కార్యదర్శి ఎం.చైతన్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు

- 31లోపు రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా అవగాహన
- ఎంపీడీవో పనస అనిత, తహసీల్దార్ కె. సురేఖ సూచన



కాకతీయ, శంకరపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పనస అనిత, తహసీల్దార్ కె. సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో పెన్షన్లు, సంక్షేమ పథకాలపై సమావేశం నిర్వహించారు. అర్హులైన వారు ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి సహకరించాలని సూచించారు. పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో పనస అనిత, తహసీల్దార్ కె. సురేఖ సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఈఆర్ఓపై బీజేపీ ఫిర్యాదుపై విచారణ

- ఓటరు జాబితా నుంచి పేరు తొలగించారంటూ ఫిర్యాదు
- పోలింగ్ కేంద్రాల మార్పుపైనా పరిశీలన
- అదనపు సీఈఓ డా. ఎ. వెంకటేశ్వరరెడ్డి 29న ఖమ్మంలో విచారణ



కాకతీయ, ఖమ్మం బ్యూరో: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా నుంచి బీజేపీ బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ–1) వీరవెల్లి రాజేష్ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించారన్న ఫిర్యాదుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. బీజేపీ తెలంగాణ ఎన్నికల కమిటీ వ్యవహారాల చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై ఈ నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ కోసం అదనపు సీఈఓ డా. ఎ. వెంకటేశ్వరరెడ్డి ఈ నెల 29న ఖమ్మంలో పర్యటించనున్నారు. రాజేష్ పేరును తొలగించడం, అదే కుటుంబంలోని ఇతరుల పేర్లను చేర్చడంపై వివరాలు సేకరించనున్నారు. వివాదాస్పదమైన నాలుగు పోలింగ్ కేంద్రాల మార్పు అభ్యర్థన తిరస్కరణ, ఇరుకైన రహదారులపై తప్పుడు నివేదికల అంశాలనూ పరిశీలించనున్నారు. మున్సిపల్ కమిషనర్, ఈఆర్ఓ పాత్రపైనా విచారణ జరగనుంది.

# రాజుల కొత్తపల్లి లో స్మార్ట్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కాకతీయ, నెల్లికుదురు: మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామంలో గురువారం తహసిల్దార్ చందా నరేష్, స్థానిక సర్పంచ్ కొండ జనార్దన్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ చేతులమీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ 10 సం.ల ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుందని దీనిని స్కాన్ చేయడం ద్వారా క్షణాల్లో కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పొందడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇతర సేవలకు స్మార్ట్ కార్డ్ గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంవత్సర సవరణ పేజ్ టులో నైనా అర్హులైన వారందరి ఓట్లన్నీ ఉండేలా చూడాలని బిఎల్ఎలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు పారదర్శకంగా ఓటర్ నమోదు చెయ్యాలని అర్హుల ఓట్లు తిరస్కరణకు గురైతే పునర్ నమోదు చేయడం కష్టమవుతుందని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ చూపి అర్హులనువిస్మరించకుండా సర్ ప్రక్రియలో ఓటు నమోదు చెయ్యాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఉప సర్పంచ్ గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ దామోదర్ రెడ్డి, పత్తిపాక తిరుపత చారి, గోవర్దన్ రెడ్డి, తూల్లనరేందర్,రామచంద్రారెడ్డ, దేగల వెంకన్న, తుళ్ళ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# హంతకులను వెంటనే అరెస్టు చేయాలి



- శివ కుటుంబీకులు, బంధువుల రోడ్డుపై ఆందోళన
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: పాత గొడవల నేపథ్యంలో యువకుడు సింహాద్రి శివకుమార్ అలియాస్ శివ హత్యకు గురైన ఘటనపై మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య జరిగి సమయం గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించారు. హంతకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబీకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. అనంతరం వారి జోక్యంతో కుటుంబీకులు, బంధువులు ర్యాలీగా బయలుదేరారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకుని ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని కుటుంబీకులు, స్థానికులు కోరారు.

# కొత్త కొలువుల నోటిఫికేషన్లకు రంగం సిద్ధం

- ఈ నెలాఖరు లేదా సెప్టెంబరు నుంచి మరో 15 ప్రకటనలు
- అత్యధికంగా అటవీ బీట్ అధికారి పోస్టుల భర్తీ
- ఆర్థిక శాఖ అనుమతించిన 3,800 పోస్టుల్లో 1,398 బీట్ అధికారి ఉద్యోగాలు
- ఇప్పటికే 9 నోటిఫికేషన్లు.. పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు మరోసారి భారీగా కొలువుల నోటిఫికేషన్లు రానున్నాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెలాఖరు లేదా సెప్టెంబరు నుంచి మరో 15 నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. పోస్టుల సంఖ్య, అర్హతలు తదితర అంశాలపై మరోసారి సమీక్ష నిర్వహించి.. పరిపాలన ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ ఏడాది 9 నోటిఫికేషన్లు జారీ చేసిన కమిషన్.. తాజాగా మరో 15 ప్రకటనలకు ఏర్పాట్లు చేస్తోంది. కొత్తగా విడుదల చేయనున్న నోటిఫికేషన్లలో అత్యధికంగా అటవీ బీట్ అధికారి పోస్టులు ఉండనున్నట్లు సమాచారం. ఇటీవల ఆర్థిక శాఖ 3,800 పోస్టుల భర్తీకి అనుమతించింది. ఇందులో 1,398 అటవీ బీట్ అధికారి పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు టౌన్ ప్లానింగ్, గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులు, ఇంజినీరింగ్, ఇతర వృత్తి నిపుణుల విభాగాల్లోని పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రతి నెలా రెండు, మూడు నోటిఫికేషన్లు విడుదల చేసేలా ప్రక్రియ కొనసాగుతోంది.

### పరీక్షలు వేగంగా పూర్తి చేసేలా..

ఇప్పటికే విడుదలైన 9 నోటిఫికేషన్లకు దరఖాస్తుల స్వీకరణ పూర్తైంది. వీటికి సంబంధించిన తాత్కాలిక పరీక్షల షెడ్యూల్‌ను కమిషన్ ప్రకటించింది. నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ముగిసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా అభ్యర్థుల మార్కులను తెరపై చూపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి పరీక్షలను పలు విడతల్లో నిర్వహించి.. మార్కులను సాధారణీకరణ విధానంలో లెక్కించనున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి కూడా 7,437 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. పోలీసు, అగ్నిమాపక, జైళ్లు, ప్రత్యేక రక్షణ దళాలకు సంబంధించి 4 నోటిఫికేషన్లు వెలువడ్డాయి. రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న వివిధ విభాగాల్లో నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. రానున్న నోటిఫికేషన్లపై ఉద్యోగార్థుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

## ఆరు నెలల్లో రహదారి పనులు పూర్తి చేయాలి

- అభివృద్ధిలో నిర్లక్ష్యానికి తావులేదు.. అధికారులకు మంత్రి ఆదేశం
- రామప్ప-లక్నవరం భూసేకరణ వేగవంతం.. మేడారం పనులపై ప్రత్యేక దృష్టి
- అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి : మంత్రి సీతక్క

కాకతీయ, ములుగు ప్రతినిధి : వెనుకబడిన ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. గురువారం కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇంజినీరింగ్ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లాలో కొనసాగుతున్న రహదారి పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలస్యం చేసే అధికారులు, గుత్తేదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్ భూసేకరణను వేగవంతం చేయాలని, దేవాదుల జలాలతో రామప్పను నింపే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. మేడారంలో జంపన్నవాగు సుందరీకరణ, రింగ్‌రోడ్డు, అతిథిగృహం పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్టేడియం, గురుకుల పాఠశాల, నర్సింగ్ కళాశాల భవనాల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.200 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

## 22-ఏ భూముల వివరాలు సమర్పించాలి

- భూభారతి నమోదుల్లో తేడాలుంటే పోర్టల్‌లోనే పరిష్కరించాలి
- ప్రతి మండలంలో ఒక గ్రామంలో రీసర్వే చేపట్టాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్

కాకతీయ, జనగామ : 22–ఏ కింద నమోదైన వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు సమర్పించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి భూభారతి, 22–ఏ, సమగ్ర రీసర్వేపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ పాల్గొన్నారు. భూభారతి డేటా ఆధారంగా 22–ఏ విస్తీర్ణంలో తేడాలుంటే పోర్టల్‌లోనే పరిష్కరించాలని సూచించారు. ఎస్ఆర్ఓల్లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సమగ్ర భూ రీసర్వే చేపట్టాలని, ఫలితాల ఆధారంగా అన్ని గ్రామాల్లో రీసర్వే చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ 22–ఏ భూముల వివరాలు సేకరించాలని, ప్రతి మండలంలో రీసర్వేకు సర్వేయర్లను నియమించాలని ఆదేశించారు. భూభారతిలో సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, నాలా తదితర పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ప్రత్యేక ఓటరు సర్వేపై వార్డు సభ పరిశీలన

- ఓటరు వివరాలు సరిచూసుకోవాలి
- తప్పులుంటే నిర్ణీత ఫారాలతో సవరణలు
- అవగాహన కల్పించాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద



కాకతీయ, ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ చింతల్ ప్రాంతంలోని మున్సిపల్ కమిటీ హాలులో ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వేపై నిర్వహించిన వార్డు సభను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఓటర్లకు కల్పిస్తున్న అవగాహన, జాబితాలో పేర్ల పరిశీలన, అభ్యంతరాలు, సవరణలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, తప్పులుంటే నిర్ణీత ఫారాల ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబానికి నాగుర్ల పరామర్శ



కాకతీయ, పరకాల : నర్సక్కపల్లె గ్రామానికి చెందిన పుస్కూరి శ్రీనివాసరావు అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు గురువారం శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు తీరని లోటని పేర్కొన్నారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బసిడి రాజు, వరికెల రాజు, సంతోష్, ప్రతాప్‌రెడ్డి, వరికెల కిషన్‌రావు, రాజీరు, లోనే సతీష్, కొమురయ్య, సురావు కిషన్, నరసింహారావు, జూపాక భాస్కర్, హింగే భాస్కర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగు తగ్గించి ఆరుతడి పంటల వైపు మళ్లండి

- యూరియా అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు
- కలెక్టర్ డా. సత్య శారద ఆదేశం




కాకతీయ, వరంగల్ ప్రతినిధి: వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ఆరుతడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతేడాది జిల్లాలో 1,39,997 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 64,293 ఎకరాల్లోనే సాగైనట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 75,704 ఎకరాల్లో 33,438 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగయ్యాయని వివరించారు. మిగిలిన విస్తీర్ణంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. యూరియా అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫార్మర్ రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని, పంటల సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన అధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరిక

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలిచ్చి వేధించే వారిపై, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరించారు. రుణాలు చెల్లించలేని వారిని బెదిరించడం, వేధించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రైవేట్ రుణాలు తీసుకునేటప్పుడు వడ్డీ, తిరిగి చెల్లింపు విధానాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగాల పేరుతో ముందస్తుగా డబ్బులు అడిగే వారిని నమ్మొద్దన్నారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు.

# కేసీఆర్ మామే మా పెళ్లి చేసిండు!



రాజకీయాల్లోకి రావాలని నేను ముందే నిర్ణయించుకున్నది కాదు.. పరిస్థితులే నన్ను ఆ దారిలోకి తీసుకొచ్చినయి. మా నాన్న రాజకీయాల్లో ఉండేవాడు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో ఎదురైన కక్షసాధింపులు నాలో కసి పెంచినయి. అయితే చిన్నప్పటి నుంచే నాకు రాజకీయాలంటే ఆసక్తి ఉండేది. పదో తరగతిలోనే స్కూల్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన. 1982లో ఎన్టీఆర్ పార్టీ పెడుతున్నాడని తెలిసి వరంగల్ నుంచి నాలుగు జీపుల్లో కార్యకర్తలను తీసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి కలిసిన. అక్కడ ఆయన పలకరించి తన కారులో నన్ను ఆయనతోపాటు ఓ మీటింగ్‌కు తీసుకెళ్లారు. అలా మొదలైన పరిచయం టీడీపీ ఏర్పాటు, జెండా రూపకల్పన వరకు వెళ్లింది. ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ప్రజల మధ్య పనిచేసిన. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా గెలిచిన. నా రాజకీయ జీవితంలో ఎన్నో మలుపులు ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికీ తలుచుకుంటే ఆసక్తిగానే అనిపిస్తయి.. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. గురువారం హన్మకొండలోని ఆయన స్వగృహంలో డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈసందర్భంగా అనేక ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!

## 'ఓడిపోయే సీటు' అన్నారు.. బీ-ఫారం వెనక్కిచ్చా

1983 ఎన్నికల్లో ఎన్టీఆర్ నన్ను పిలిచి టికెట్లు ఎంచుకోవాలని అడిగాడు. వరంగల్ నుంచి మూడు అసెంబ్లీ, ఒక ఎంపీ టికెట్ ఇస్తే గెలుస్తామని చెప్పిన. నాకు వరంగల్ లేకపోతే వర్ధన్నపేట కావాలని పట్టుబట్టిన. నాలుగు బీఫారాలు ఇచ్చాడు. వరంగల్ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థి దొరకక బండారు నాగభూషణ్‌ను నిలబెట్టినం. ఆయన గెలిచిండు. పార్టీ అధికారంలోకి వచ్చింది. మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలని ఎన్టీఆర్ అడిగితే మాచర్ల సత్యనారాయణ బీసీ అని ఆయనకు ఇవ్వాలని సూచించిన. 1985లో టీడీపీ-బీజేపీ పొత్తులో వర్ధన్నపేట బీజేపీకి వెళ్లింది. నాకు హనుమకొండ బీఫారం ఇచ్చారు. తీసుకొని మెట్లు దిగుతుంటే ఒక నాయకుడు 'ఓడిపోయే సీటు నీకు ఇచ్చారు' అన్నాడు. వెంటనే వెనక్కి వెళ్లి నాకు వద్దని చెప్పి వి.వెంకటేశ్వర్లుకు ఇప్పించిన ఆయన గెలిచిండు. ఆ తర్వాత ఎన్టీఆర్ అభిమానంతో జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశం ఇచ్చాడు. అయితే ఎడబోయిన బస్వారెడ్డి పోటీకి రావడంతో అదీ వదులుకున్న. 1987లో పర్వత గిరి పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత డీసీసీబీ చైర్మన్ పదవికి పోటీ చేసి గెలిచా. వాస్తవానికి మా పార్టీకి సంఖ్యాబలం తక్కువగా ఉన్నా వ్యక్తిగత సంబంధాలతో గెలిచిన. తెలుగుదేశం పార్టీ కీలక నిర్ణయాల్లో నన్ను ఎన్టీఆర్ భాగస్వామిని చేసేవారు. పార్టీ పొలిట్‌బ్యూరో, త్రీమెన్ కమిటీలోనూ పనిచేసిన.తెలంగాణతో పాటు రాయలసీమ, ఆంధ్రప్రాంతంలోని లీడర్లతో కో ఆర్డినేషన్ చేసేవాడిని.



మా నాన్న రాజకీయ జీవితంలో కాంగ్రెస్ చేసిన కక్షసాధింపులే నాలో రాజకీయ కసి పెంచినయి. 1982లో ఎన్టీఆర్ పార్టీ పెడుతున్నాడని తెలిసి.. ఆయన చెన్నై నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడని తెలుసుకొని వరంగల్ నుంచి నాలుగు జీపుల్లో కార్యకర్తలను తీసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన. ఎన్టీఆర్ ట్రైన్ దిగగానే 'జై ఎన్టీఆర్' అంటూ నినాదాలు చేసినం. ఆయన నన్ను గుర్తించి నాదగ్గరకు వచ్చి పలకరించారు.. ఏంటీ బాబు ఎక్కడి నుంచి వచ్చారంటూ ఆరా తీశారు. వరంగల్ నుంచి అని చెప్పగానే.. కారులో తనతో పాటు నాందెడ్ల ఇంటికి తీసుకెళ్లారు. టిఫిన్ చేసిన అనంతరం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ఏర్పాటుపై సమావేశం ఉందని చెప్పి నన్నూ తీసుకెళ్లాడు. టీడీపీ ఏర్పాటు, జెండా రూపకల్పన కోసం ఎన్టీఆర్ పర్వతగిరి ఉపేందర్‌ను కన్వీనర్‌గా, యూత్ తరపున నన్ను ఎంపిక చేశారు. నేను చురుగ్గా ఉండటంతో మొదట్నుంచి నాపై ప్రత్యేక అభిమానం చూపేవాడు. వరంగల్‌లో ఎన్టీఆర్ సభ పెట్టాలనుకుని దోనపూడి రమేశ్‌బాబుతో కలిసి సన్నాహక సమావేశం పెట్టినం. 1982లో ఇస్లామియా గ్రౌండ్‌లో సభ భారీగా సక్సెస్ అయింది. ఆ సభకు నేను అధ్యక్షత వహించా. ఆ సభలోనే నన్ను జిల్లా కన్వీనర్‌గా, రమేశ్‌బాబును పట్టణ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ప్రకటించాడు.

## ఎన్టీఆర్ ట్రైన్ దిగగానే.. నా రాజకీయ కథ మొదలైంది

**చిన్నప్పటి నుంచే రాజకీయాలపై నాకు ఆసక్తి**

**టీడీపీలో ఆది నుంచి అన్నింటా కీలకమయ్యాను**

**ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా విజయం వెనుక ఉన్నది ప్రజల అభిమానమే**

**ఎంపీగా మాత్రం ఊహించని విజయం సొంతం**

**లక్ష్మీపార్వతి 'వడ్డాణం' అడిగారు.. అందుకే మంత్రి పదవి వద్దన్నా**

**పాలకుర్తిలో మాస్క్ పెట్టుకుని సర్వే చేసుకున్నాకే అక్కడికి వెళ్లా**

**డీలిమిటేషన్ తర్వాత ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా..**

**వారసులను మాత్రం రాజకీయాల్లోకి దింపను**

**డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాజీమంత్రి ఎర్రబెల్లి ఆసక్తికర అంశాల వెల్లడి**



## ఎంపీగా గెలవడం వండర్.. పాలకుర్తిలో మాస్క్‌తో తిరిగిన

1994లో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన. 1999, 2004లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించిన. 2008లో వరంగల్ ఎంపీగా గెలవడం నాకు కూడా వండర్. జిల్లాలో నేనొక్కడినే టీడీపీ ఎమ్మెల్యేను. మిగతా వారంతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే. చంద్రబాబుకు నేను నిలబడనని చెప్పినా ఆయన వినలేదు. అప్పుడు కాంగ్రెస్ నుంచి రమేశ్‌రెడ్డి పోటీ చేశారు. అందరూ ఆయన గెలుస్తారని అనుకున్నారు. కానీ నాకు ప్రతి ఊళ్లో పరిచయస్తులు ఉన్నరు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎవరూ ఊహించని విధంగా గెలిచిన. ఆ సమయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నన్ను కాంగ్రెస్‌లోకి రావాలని పిలిచాడు. మంత్రి పదవి కూడా ఆఫర్ చేశారు. కానీ నేను పోలేదు. అది మనసులో పెట్టుకున్న వైఎస్సార్.. డీలిమిటేషన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ముక్కలుగా చేశారు. అంతేకాదు వర్ధన్నపేట, వరంగల్ ఎంపీ స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. వరంగల్, పాలకుర్తిలో సర్వే చేసుకున్న. పాలకుర్తిలో ముఖానికి మాస్క్ వేసుకొని కూలీలు, ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్న. 'దయాకర్ వస్తున్నడు.. మంచోడు.. గెలిపించుకుంటాం' అని చెప్పడంతో పాలకుర్తికి వెళ్లిన. 2009లో గెలిచిన. 2014లోనూ గెలిచి టీడీపీ నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన. తర్వాత పది మంది ఎమ్మెల్యేలతో కలిసి టీఆర్ఎస్‌లో చేరిన. కేసీఆర్ వెంటనే మంత్రి పదవి ఇస్తానన్నా.. పార్టీ గుర్తుపై గెలిచిన తర్వాతే తీసుకుంటానని చెప్పిన. 2018లో ఆరోసారి గెలిచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా శాఖల మంత్రిగా పనిచేసిన. ఎన్నో అవార్డులు వచ్చినయి.

## 'వడ్డాణం చేయించు' అన్నారు.. మంత్రి పదవే వద్దనుకున్నా

1994లో తొలిసారిగా టీడీపీలో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఎన్టీఆర్ నన్ను పిలిచి మంత్రి పదవి ఇస్తానన్నాడు. అయితే అదే సమయంలో ఎన్టీఆర్–లక్ష్మీపార్వతి పెళ్లికి నేను నిరాకరించిన. నెలరోజులు ఆపగలిగాను. తర్వాత ఒకరోజు ఎన్టీఆర్ ఇంటికి వెళ్లితే లక్ష్మీపార్వతి.. 'నేను నీకు మంత్రి పదవి ఇప్పిస్తానని చెప్పాను కదా.. నాకు ఒక వడ్డాణం చేయించు' అని అడిగారు. దీంతో 'వడ్డాణం లేదు.. ఏమీ లేదు.. మంత్రి పదవి వద్దు' అంటూ వచ్చేసిన. ఇది నేను చెప్పకోవడం కాదు. ఈ ఘటనను చూసిన అప్పటి ఎన్టీఆర్ డ్రైవర్ కూడా ఇటీవల ఇంటర్వ్యూలో చెప్పాడు. ఎన్టీఆర్ దగ్గరకు రెగ్యులర్‌గా వెళ్లేవాళ్లలో నేను, జస్టిస్ రమణ ఇద్దరమే. ఉదయమే ఆయన దగ్గరకు వెళ్లి పార్టీ, ప్రభుత్వ విషయాలు చెప్పేవాళ్లం. టీడీపీలోకి సీతక్క, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులను తీసుకొచ్చి ప్రోత్సహించిన. గంగుల కమలాకర్, విద్యాసాగర్‌రావు, మాగంటి గోపినాథ్ తదితరులకు టికెట్లు ఇప్పించడంలోనూ పాత్ర ఉంది. ఎంసీపీఐ–యూతో పొత్తు కోసం ఓంకార్‌తో మూడు నాలుగు సార్లు మాట్లాడిన. ఎంసీపీఐ–యూకు మూడు టికెట్లు ఇస్తామంటే ఓంకార్ నాలుగు కావాలని పట్టుబట్టాడు. చివరకు 1994లో నర్సంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా రేవూరి ప్రకాశ్‌రెడ్డిని నిలబెట్టినం. ఆయన గెలిచిండు. తెలంగాణ ఉద్యమ సమయంలో జయశంకర్ సార్ సూచనతో చంద్రబాబు వద్దకు వెళ్లి తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇవ్వాలని అడిగిన. మొదట నిరాకరించడంతో పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేస్తానని చెప్పిన. వెంటనే తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చాడు.

## 'కేసీఆర్ మామే మా పెళ్లి చేసిండు'

నేను 1956 జూలై 4న పర్వతగిరిలో పుట్టిన. మా అమ్మానాన్నలు ఆది లక్ష్మి-జగన్నాథం. చిన్నప్పటి నుంచే రాజకీయాలంటే ఇంట్రెస్ట్. పదో తరగతిలో స్కూల్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన. నాకు పోటీగా నా మిత్రుడు బొల్లం సంపత్‌కుమార్ ఉండే. నేను ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఉన్నా.. చేసిన ఓ తుంటరి పని వల్ల ఓడిపోయిన. ఆ రోజులను తలుచుకుంటే ఇప్పటికీ నవ్వొస్తది. నాకు 18 ఏళ్లకే పెండ్లి అయింది. కేసీఆర్ మామ కేశవరావు దగ్గరుండి సంబంధం చూసి పెండ్లి చేసిండు. నాకు ఒక కూతురు, ఒక కొడుకు. మా నాన్న ఎర్రబెల్లి జగన్నాథం రాజకీయాల్లోనే ఉండేవాడు. పర్వతగిరి సర్పంచ్‌గా ఆరుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరంగల్ జిల్లాలో ఐదు సమితిల్లో ఒకటయిన సంగెం సమితి అధ్యక్షుడిగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్‌లోని అంతర్గత పోరుతో టాస్ వేయాల్సి వచ్చి ఓడిపోయాడు. తర్వాత ఓడీసీఎంఎస్ చైర్మన్‌గా పోటీ చేసినా కాంగ్రెస్‌లోని లొల్లి వల్ల పదవి రాలేదు. వైస్ చైర్మన్‌గా, ఆ తర్వాత వరంగల్ ల్యాండ్‌బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశాడు.

## ఎంజీఎం అంటే నాకు ప్రత్యేక ఇష్టం.

ఎంజీఎం అంటే నాకు ప్రత్యేక ఇష్టం ఉండేది. 1994లో ఎమ్మెల్యేగా గెలిచాక చాంబర్ ఆఫ్ కామర్స్ వాళ్లతో మాట్లాడి రూ.20 లక్షలు ఇప్పించి కొత్త బెడ్లు వేయించిన. కేఎంసీలో చదువుకున్న వాళ్ల పరిచయాలతో రూ.2 కోట్లు విరాళాలు సేకరించి ఆడిటోరియం కట్టించిన. ఎంజీఎం అభివృద్ధిని చూసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీలోనే నన్ను పొగిడారు. కేసీఆర్‌కు సైతం ఆస్పత్రులు బాగుండాలని ఉండేది. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో మల్టీలెవల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి దుబాయ్‌లో చూసిన మోడల్ స్ఫూర్తిగా నిలిచింది. నన్ను ఎక్కడికి పోయినా 'దయన్న' అని పిలుస్తరు. పర్వతగిరిలో మాత్రం 'దొర' అంటరు. అందరితో కలిసిపోవడం, ఉదయం 6 గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉండటం వల్లే ఆ అభిమానం వచ్చింది.

## డాక్టర్ కావాలనేది నాన్న కల.. నేను మాత్రం అటువైపు పోలే

మా నాన్న నన్ను డాక్టర్ చేయాలని అనుకున్నాడు. పట్టుబట్టి ఎల్‌బీ కాలేజీలో బైపీసీలో చేర్పించాడు. కాకతీయ మెడికల్ కాలేజీకి దగ్గరగా ఉంటుందని.. డాక్టర్లను చూసైనా నాకు ఆ ఆశ కలుగుతుందని భావించాడు. కానీ నాకు సదువు అంతగా అబ్బలేదు. దీంతో అగ్రికల్చర్ బీఎస్సీ చదివించాడు. చదువుకునే రోజుల్లో జయశంకర్ సార్ ఇంట్లో నెలరోజులు ఉన్న. తెలంగాణ ఉద్యమం చేసిన రోజుల్లో దుర్గా టాకీస్ తగలబెట్టిన కేసులో కూడా ఉన్న. అయితే మైనర్‌ను అని ఆ కేసు నుంచి తీసేశారు. వ్యవసాయం అంటే నాకు చాలా ఇష్టం. ఒకసారి 15 ఎకరాల్లో మిర్చి వేసిన. తెగులు వచ్చి బాగా లాస్ అయిన. అక్కడి నుంచి కాంట్రాక్టర్‌గా మారిన. ఆర్‌అండ్‌బీ పనులు ఎక్కువగా చేసిన. రంగశాయిపేట, తీగరాజుపల్లి రోడ్డు కూడా వేసింది నేనే.

## ఓడిపోతానని ఆరు నెలల ముందే తెలుసు

ఒకప్పుడు మా కుటుంబానికి 500 ఎకరాల వరకు ఉండేది. రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నానే తప్ప అక్రమంగా సంపాదించుకోలేదు. 200 ఎకరాల వరకు మా పేరు మీద ఉంటే.. ఇటీవల కబ్జాలో ఉన్నవారికి రాసి ఇచ్చిన. నాకు సాయం చేయడమే తెలుసు. నా భార్య ఉషా నాకు పుష్కలంగా సపోర్ట్ చేస్తది. ఎర్రబెల్లి ట్రస్ట్‌ను ఆమెనే చూసుకుంటది. కుట్టుమిషన్లు, నిరుద్యోగులకు కోచింగ్, 200 వాటర్ ప్లాంట్లు, డ్రైవింగ్ లైసెన్సులు ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నం. 2024 ఎన్నికల్లో ఓడిపోతానని ఆరు నెలల ముందే తెలుసు. ఈ విషయం కేసీఆర్‌కు కూడా చెప్పిన. వేరే స్థానం కావాలని అడిగిన. కానీ అలా జరగలేదు. 'ఎన్ని రోజులు దయాకర్‌రావే' అనే మాట వచ్చింది. అందుకే ఓడిపోయిన. డీలిమిటేషన్‌లో స్థానాలు మారడం పక్కా. ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా. రాజకీయాల్లోకి మాత్రం వారసులను దింపే ఆలోచన లేదు.



కాకతీయ,తెలంగాణ బ్యూరో/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266